రైతు బజారు ఏర్పాటు కలేనా!

- రైతు బజారు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసిన పాలకులు
- రైతు బజారు కోసం ఎదురు చూస్తున్న ప్రజలు, రైతులు
- పునఃప్రారంభించాలని కోరుతున్న గ్రామస్తులు

జి.కొండూరు: మండల ప్రజల చిరకాల కోరిక జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు. దశాబ్దాలుగా స్థానిక ప్రజలు, రైతులు ఆశగా దీని కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేస్తే స్థానికంగా కూరగాయలు పండించే రైతులకు, వినియోగదారులకు కూడా లాభం చేకూరుతుంది. గతంలో రైతు బజారు ఏర్పాటు పనులను ప్రారంభించిన అధికారులు ఆ పనులను సగంలోనే నిలిపివేశారు. ఇకనైనా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు రైతు బజారు ఏర్పాటుకు ఉపక్రమించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికంగానే కూరగాయలు లభ్యం

జి.కొండూరు మండల పరిధిలోని జి.కొండూరు, చెవుటూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, తెల్లదేవరపాడు, సున్నంపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాల్లో అన్నిరకాల కూరగాయలను వంద ఎకరాలకు పైగా రైతులు సాగు చేస్తుంటారు. స్థానిక మార్కెట్ కానీ, రైతు బజారు కానీ ఇక్కడ లేకపోవడంతో వారు పండించిన పంటలను విజయవాడకు తరలించి తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ఇవే ఉత్పత్తులను స్థానిక ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలు చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అదే జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకోవడం వల్ల అటు రైతులకు, ఇటు వినియోగదారులకు లాభం చేకూరుతుంది.

నిర్మాణ పనులను పునఃప్రారంభించాలి

జి.కొండూరులో కమ్యూనిటీహాల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రైతు బజారు ఏర్పాటుకు 2018 డిసెంబర్ 31న అప్పటి జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. దీనికి రూ.11 లక్షలు సైతం కేటాయించారు. పనులను ప్రారంభించి రెండు గోడలైతే నిర్మించారు కానీ రైతు బజారును ఏర్పాటు చేయలేదు. ఆ పనులు అప్పటి నుంచి మరలా ప్రారంభం కాలేదు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతు బజారును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


జి.కొండూరు కమ్యూనిటీ హాల్ ఎదురుగా రైతు బజారు ఏర్పాటుకు కేటాయించిన స్థలం


రైతు బజారు ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం

తరిగిపోయిన టమాటా

గత పదేళ్ల కిందటి వరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో టమాటా ఉత్పత్తిలో జి.కొండూరు మండలం ప్రథమ స్థానంలో ఉండేది. ఏడాదికి రెండు వేల టన్నులకు పైగా టమాటా జి.కొండూరు మండలం నుంచి ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అయ్యేది. పాలకులు, స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల స్థానికంగా మార్కెట్ లేకపోవడం, రైతులకు నాణ్యమైన దిగుబడులను పొందే అంశాలపై అవగాహన కల్పించకపోవడం, టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నిర్లక్ష్యం వహించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి టమాటా సాగు చేసేందుకు వెనుకాడారు. ఇప్పుడు రైతు బజారునైనా త్వరితగతిన ఏర్పాటు చేస్తే కూరగాయల సాగు ఊపందుకుంటుందని స్థానికులు చెబుతున్నారు.

రైతు బజారు ఏర్పాటు చేయాలి



రైతు బజారు ఏర్పాటుపై గతంలో ఆహార సలహా సంఘాల సమావేశంలో పలుమార్లు నేను అధికారుల దృష్టికి తీసుకెళ్లా. అప్పట్లో ఏర్పాటుకు పనులను ప్రారంభించి ఆపేశారు. త్వరితగతిన రైతు బజారు ఏర్పాటు చేస్తే వినియోగదారులకు, రైతులకు మేలు జరుగుతుంది.

– బూరుసు శివ, ట్రేడ్ యూనియన్ నాయకుడు, జి.కొండూరు

రైతు బజారుతో ప్రజలకు మేలు



జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు చేయాలి. స్థానికంగా రైతులు పండించిన కూరగాయలను విజయవాడ తరలించి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మరలా అవే కూరగాయలను వ్యాపారులు తీసుకొచ్చి ప్రజలకు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. రైతు బజారు ఉంటే నేరుగా రైతులే ప్రజలకు తమ ఉత్పత్తులను విక్రయిస్తారు.

– జి. బలరామిరెడ్డి, రైతు, చెవుటూరు గ్రామం

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: డీఎస్సీ, ఎస్జీటీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే వారికి బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నామని జిల్లా సంచాలకులు శ్రీనివాసరావు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు ఈ నెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణ 60 రోజులు కొనసాగుతుందని చెప్పారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, టెట్ మార్కుల వివరాలతో విజయవాడ అశోక్ నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్: 95050 94349 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

ఎమ్మెల్సీ ఓటుహక్కుకు 10,401 దరఖాస్తులు

తిరువూరు: కృష్ణా–గుంటూరు శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గానికి త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు కోరుతూ తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 10,401 దరఖాస్తులు వచ్చాయని ఆర్డీఓ మాధురి తెలిపారు. ఎ.కొండూరు మండలంలో 1,420 దరఖాస్తులు వచ్చాయన్నారు. గంపలగూడెం మండలంలో 2,094, రెడ్డిగూడెం మండలంలో 1,733, తిరువూరులో 2,921, విస్సన్నపేటలో మొత్తం 2,233 దరఖాస్తులు అందాయని వివరించారు.

విదేశీ విద్యపై అవగాహన

మైలవరం: విదేశీ విద్యకు అగ్రశ్రేణి విశ్వ విద్యాలయాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ డి.వీరయ్య అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో విదేశీ విద్యపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ అడ్మిషన్స్ ప్రాసెస్, స్కాలర్‌షిప్ లభ్యత వివరాలు తెలిపారు. విద్యార్థి వీసా సంబంధిత సమాచారం విదేశీ విద్య నిపుణుల ద్వారా సమగ్ర మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిశువుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత అందరిది

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు

నూజివీడు: శిశువుల ఆరోగ్యం, భద్రత, సంరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు అన్నారు. ప్రపంచ శిశు రక్షణ దినోత్సవం సందర్భంగా అజరయ్యపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ శిశువులకు సరైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ అందించాలన్నారు. అప్పుడే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. సీడీపీఓ ఎస్వై నూరానీ మాట్లాడారు.

రేషన్ పంపిణీ పరిశీలన

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో రేషన్ పంపిణీని తిరువూరు ఆర్డీఓ మాధురి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని రెండు రేషన్ దుకాణాలను, ఎండీయూ వాహనాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్ ఇనపనూరి లక్ష్మీ దుకాణంలో 500 కిలోల బియ్యం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఎండీయూ వాహనంలో 500 కిలోల బియ్యం తక్కువగా ఉన్నట్లు ఆర్డీఓ గుర్తించారు. ఈ విషయమై రేషన్ డీలర్ లక్ష్మీ, ఎండీయూ వాహన డ్రైవర్ తిరుపతిరావులపై 6 (ఏ) కేసు నమోదు చేశారని పీడీఎస్ డీటీ నాగరాజు తెలిపారు. గంపలగూడెం తహసీల్దార్ రాజకుమారి పాల్గొన్నారు.

మద్యం అమ్మకాల్లో నిబంధనలు పాటించాలి

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

మైలవరం: మద్యం ఎమ్ఆర్పీకే విక్రయించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలోని మొత్తం 10 మద్యం దుకాణాల క్యాషియర్లు, సేల్స్‌మెన్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తికి మూడు సీసాలకు మించి ఇవ్వరాదని, 21 సంవత్సరాలు వయస్సు లోపు వారికి మద్యం అమ్మరాదని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై మొదటి కేసుకు రూ.5 లక్షలు జరిమానా, రెండో కేసుకు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. పాత కేసుల్లోని 5 మందిని మైలవరం తహసీల్దార్ ఎదుట, ముగ్గురిని రెడ్డిగూడెం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

సీవీ రామన్ స్ఫూర్తితో పరిశోధనల్లో రాణించాలి

గానుగపాడు(తిరువూరు): సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ పరిశోధనల్లో మేటి అని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులు పరిశోధనల్లో అద్భుతాలు సృష్టించాలని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి అన్నారు. సీవీ రామన్ జయంతి కార్యక్రమం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెచ్ఎం, ఉపాధ్యాయులు రాంప్రదీప్, సుదర్శన్, సాయిరాం, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, రాములు పూలమాల వేసి నివాళులర్పించారు. భౌతికశాస్త్రంలో రామన్ చేసిన ప్రయోగాలు, వాటి ఫలితాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

సర్దుబాటు పేరుతో నిలువు దోపిడీ

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్ర కిరణ్ ధ్వజం

మైలవరం: విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో కూటమి ప్రభుత్వం వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్ర కిరణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో బిల్లులు వసూలు చేయడంపై మైలవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు హైఓల్టేజ్ షాక్ ఇచ్చిందన్నారు. ఇప్పటికే 6 వేల కోట్ల భారాన్ని మోపి, ఇది చాలదన్నట్లు ఇంకో రూ.12 వేల కోట్ల భారం వేసేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందని ధ్వజమెత్తారు. తక్షణమే సర్దుబాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోతరాజు ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నూజివీడు: పల్లెర్లమూడి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌యూవీ హనుమంతరావు గురువారం తెలిపారు. ఇటీవల గన్నవరంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బేస్‌బాల్‌లో పదో తరగతి విద్యార్థి కె. జస్వంత్ కుమార్, సాఫ్ట్‌బాల్‌లో 8వ తరగతి విద్యార్థి పి. భువన చంద్ర, కె. మౌనిక ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను హెచ్ఎంతో పాటు పీడీ బీవీ నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సబ్ డివిజన్‌లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం గొల్లపూడిలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ శిక్షణ సమన్వయకర్త టి. మాధవీలత మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులకు సంబంధించి రూపొందించిన సీఎల్ఎస్–పీడీఎస్ఎస్, ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి. వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి యాప్‌ల పనితీరును పరిశీలించారు.

అన్ని వర్గాలకు అందుబాటులో క్యాన్సర్ చికిత్స

గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీరమ్య

మైలవరం: అన్ని వర్గాల ప్రజలకు క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని విజయవాడకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె. శ్రీరమ్య అన్నారు. జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సహేలీ ద గరల్స్ క్లబ్, ఐసీసీ ఆధ్వర్యంలో మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, ఇంజినీరింగ్ విద్యార్థినులకు క్లోజ్ ద కేర్ గ్యాప్ అంశంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. డాక్టర్ శ్రీరమ్య మాట్లాడుతూ సర్వేకల్ క్యాన్సర్ లక్షణాలు, వ్యాధి నివారణ టీకాల ప్రాముఖ్యత, రోగ నిర్ధారణ పద్ధతుల ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ ఆర్. శోభారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఐసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ వి. పార్వతి మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరమ్యను సత్కరించారు.

అవగాహన ర్యాలీ

ఎ.కొండూరు: ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని ఎ.కొండూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దివ్య, స్వాతి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలపై బడిన వారందరికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గొల్లమందల గ్రామంలో క్యాన్సర్‌పై ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ స్వాతి పీహెచ్ఎన్ దయామణి, హెచ్‌వీ పద్మావతి, సూపర్‌వైజర్ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎ.కొండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

క్యాన్సర్‌ను నిర్మూలిద్దాం

చాట్రాయి: క్యాన్సర్‌ను నిర్మూలిద్దామని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. చాట్రాయిలో క్యాన్సర్ నిర్మూలనపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. వైద్యులు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చనుబండలో జరిగిన కార్యక్రమంలో డెప్యూటీ జిల్లా వైద్యాధికారి లక్ష్మీనారాయణ, వైద్యులు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు అమరయ్య, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

దురలవాట్లతో క్యాన్సర్ బారిన పడొద్దు..

తిరువూరు: మద్యపానం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులకు బానిసలై క్యాన్సర్‌కు గురికావద్దని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రేష్మా బేగం అన్నారు. ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా తిరువూరులో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దురలవాట్లతో అధికశాతం ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. క్రమం తప్పని వ్యాయామం, శారీరక శ్రమ, మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యకరంగా జీవించవచ్చని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బూడిద లారీలను అడ్డుకుని ఆందోళన

- పలుకుబడి ఉన్న వారికే లోడింగ్ చేస్తున్నారని ఆగ్రహం
- లోడింగ్‌కు అందరికీ అనుమతి ఇవ్వాలని డిమాండ్

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చెరువు నుంచి బూడిద రవాణా చేస్తున్న లారీలను స్థానిక లారీ అసోసియేషన్ డ్రైవర్లు, యజమానులు గురువారం అడ్డుకుని ఆందోళన చేశారు. పలుకుబడి కలిగిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల లారీలకు మాత్రమే లోడింగ్ చేస్తున్నారని ఆరోపించారు. అసోసియేషన్‌లో ఒకటి, రెండు లారీలు కలిగిన వారికి లోడింగ్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుకుబడి కలిగిన వారికి రోజుకు మూడు నుంచి నాలుగు లారీల లోడింగ్ ఇస్తున్నారని, మాకు వారంలో ఒక లారీ లోడింగ్ చేయడం వలన లారీలకు ఫైనాన్స్ బకాయిలు చెల్లించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి తోడు స్థానిక కాలనీ ప్రజలు బూడిద లారీల రవాణాతో వస్తున్న కాలుష్యంతో మా ఆరోగ్యాలు గుల్లవుతున్నాయని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ ఎ.చంద్రశేఖర్ బూడిద చెరువు వద్దకు చేరుకుని అధికారులు, లారీ ఓనర్లు, డ్రైవర్లతో చర్చలు జరిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


లారీలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు, లారీ యజమానులు

రహదారులకు మరమ్మతులు చేపట్టాలని నిరసన

ఎ.కొండూరు: ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం గిరిజనులతో కలిసి రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడి ప్రయాణం చేయాలంటే ఇబ్బందికరంగా మారిందన్నారు. కుమ్మరికుంట్ల వంతెన కూలిపోవడంతో ఈ రోడ్డు నరకానికి దారి అన్నట్లు ఉందని చెప్పారు. ఈ ప్రభుత్వం వచ్చి 4 నెలలు పూర్తయినా మరమ్మతులు చేపట్టలేదని విమర్శించారు. గత మూడు రోజుల కిందట భూక్యా పటేల్ అనే వ్యక్తి గుంటలో పడి మృతి చెందాడని గుర్తు చేశారు. పటేల్ కటుంబానికి నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్, నాగరాజు, ఝాన్సీ, ఎం. నాగేశ్వరరావు, కోటి, కొండూరు తండా, చైతన్య నగర్ తండా గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ఏఓ చాముండేశ్వరి

నూజివీడు: సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు దేశ పౌరులు తమకు కావాల్సిన సమాచారాన్ని కోరవచ్చని వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి అన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో మండలంలోని రైతులకు గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో పారదర్శకతను తీసుకువచ్చేందుకు 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 3(1) ప్రకారం ప్రభుత్వం నుంచి, ప్రభుత్వ అనుబంధ సంస్థల నుంచి పౌరులందరూ సమాచారాన్ని కోరవచ్చన్నారు. పౌరులు కోరిన సమాచారాన్ని తప్పనిసరిగా అధికారులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడానికి అప్పిలేట్ అధికారి ఉంటారన్నారు. రాజ్యాంగం కల్పించిన ఈ చట్టంపై రైతులందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

● **ముసునూరు:** సమాచార హక్కు చట్టం సామాన్యుల చేతిలో పాశుపతాస్త్రం వంటిదని మండల వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టంపై మండల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీస్ సంధ్యారాణి సమాచార హక్కు కోరేందుకు దరఖాస్తు చేసుకునే విధానం, చట్టం పరిధి, పరిమితులపై అవగాహన కల్పించారు.

లోపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో విచారణ చేపట్టాలి

ముసునూరు: లోపూడి ప్రాథమికోన్నత పాఠశాలలో పరిస్థితులు, ఖాళీ పేపర్లలో కమిటీ సభ్యుల సంతకాలు తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని పాఠశాల వంట ఏజెన్సీ, పారిశుద్ధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు స్థానిక విలేకరుల ఎదుట తమ గోడు వినిపించారు. ఇటీవల నూజివీడు డీవైఈఓ పాఠశాలలో జరిపిన విచారణ తూతూ మంత్రంగా, అసమగ్రంగా, అసంబద్ధంగా, ఏకపక్షంగా జరిగిందని ఆరోపించారు. కొంతమందితో మాత్రమే మాట్లాడి అంతా బాగానే ఉందని నివేదిక ఇవ్వడంపై ఆక్షేపించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఖాళీ తెల్ల కాగితాలపై కమిటీ సభ్యుల సంతకాల సేకరణ, కమిటీకి సంబంధం లేని వ్యక్తులతో సమావేశం నిర్వహించి, వంట ఏజెన్సీ, పారిశుద్ధ్య కార్మికులను తొలగిస్తూ చేసిన తీర్మానాలు, ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అందరినీ పిలవకుండా విచారణ పూర్తి చేయడమేంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

మహిళా వైద్యుల రక్షణకు పటిష్ట చర్యలు

ఏలూరు జిల్లా పోలీసు ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరి

నూజివీడు: ఆస్పత్రుల్లోని మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది రక్షణకు ఆస్పత్రి వర్గాలు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా పోలీసు ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరి అన్నారు. పట్టణంలోని గిఫర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన భద్రతా చర్యలపై గురువారం జిల్లా కమిటీ సభ్యులు భద్రతా ఆడిట్ నిర్వహించారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాలు, పర్యవేక్షణ కేంద్రం, వైద్య సిబ్బంది విశ్రాంతి ప్రదేశాలు, ఆ ప్రాంతంలో రక్షణ చర్యలను పరిశీలించారు. డీఎస్పీ శ్రీహరి మాట్లాడుతూ కోల్‌కతా ఘటన నేపథ్యంలో 100 పడకల పైబడిన ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి భద్రతను మెరుగుపరచడానికి, సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడానికి అవసరమైన సూచనలు అందించేందుకు జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేశారన్నారు. సదరు కమిటీ ఆస్పత్రులను పరిశీలించి రక్షణ చర్యలపై నివేదిక అందిస్తోందని చెప్పారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడేవారిపై చట్టరీత్యా తీసుకునే చర్యలు, శిక్షలకు సంబంధించిన వివరాలను ఆస్పత్రులలో ప్రదర్శించాలన్నారు. గిఫర్డ్ మెమోరియల్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పి. శ్యాం మోజెస్, అడ్మినిస్ట్రేటర్ పి. ప్రసంగి, వైద్యులు ప్రవీణ్‌కుమార్, దీప్తి చిన్నం, కమిటీ సభ్యులు చప్పిటి దుర్గాప్రసాద్, డాక్టర్ పద్మజారాణి, డాక్టర్ వి. శారద, డాక్టర్ షేక్ హాఫీజా, తహసీల్దార్ బి. సుబ్బారావు, ట్రాన్స్‌కో ఏడీ ఓలేటి దుర్గారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణ పరిధిలో శుక్రవారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. పట్టణంలోని బంగినపల్లితోట ప్రాంతంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండగా మెయిన్ మంచినీటి పైప్‌లైన్ డ్యామేజ్ అయిందని, దీంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. పట్టణ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరికైనా మంచినీరు అవసరముంటే ఫోన్ చేస్తే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. మునిసిపల్ డీఈ కె. వెంకటరావు సెల్: 98499 85465, ఏఈలు పి. వంశీ అభిషేక్ సెల్: 91009 42627, కె. మారయ్యబాబు సెల్: 98499 85471 నంబర్లకు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకే ఫుడ్‌కోర్టు కేటాయింపు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకే ఆర్జీయూకేటీ యాజమాన్యం మెప్మాకు చెందిన పట్టణ సమాఖ్యకు నూజివీడు ట్రిపుల్ ఐటీలోని ఫుడ్‌కోర్టు, నాలుగు ఫ్యాన్సీ షాపులు, రెండు సెలూన్లు, ఒక పార్లర్, రెండు జిరాక్స్ షాపులను కేటాయించిందని ఏఓ బి. లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 6న ఫుడ్‌కోర్టు వ్యవహారంపై మీడియా కథనంపై ఆయన స్పందించారు. దీనిపై నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏఓ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెప్మాకు ఇవ్వాలనే అంశానికి ఆర్జీయూకేటీ పాలక మండలి సైతం ఆమోదం తెలిపిందన్నారు. నిబంధనలకు అన్నింటికీ నూజివీడు ట్రిపుల్ ఐటీ కట్టుబడి ఉందన్నారు.

వీధి లైట్లు లేక ఇబ్బందులు

ఆగిరిపల్లి: స్థానిక కొత్త మసీదు వీధిలో వారం రోజుల నుంచి వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు, చిన్నపిల్లలు రోడ్లపై చీకటిలో నడవడానికి ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం సారా నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు జరిపారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో నిర్వహించిన దాడుల్లో సారా కాయడానికి పొలాల్లో సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీఎస్ఎస్ వర్మ తెలిపారు. సారా తయారీ చట్టవిరుద్ధమని, ఇందుకు ప్రయత్నించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నంపేటలో రైతుల ధర్నా

చాట్రాయి: ఈ క్రాప్ నమోదు కాని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య డిమాండ్ చేశారు. చిన్నంపేట రైతు సేవా కేంద్ర వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలా మంది పేద రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోలేకపోవడంతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోలేకపోతున్నారని చెప్పారు. గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, అసైన్‌మెంట్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఉచితంగా బోర్లు, విద్యుత్ సర్వీసులు ఇచ్చి నీటి వసతిని కల్పించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, రైతు సంఘం నాయకులు ఈవీ శ్రీనివాస్, మర్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



విస్సన్నపేట: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుక్కడపు శ్రీనివాసరావు అన్నారు. విస్సన్నపేట మండల శాఖ కౌన్సిల్ సమావేశం మండల శాఖ అధ్యక్షురాలు చైతన్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా యూటీఎఫ్ అనేక పోరాటు చేసి ఉపాధ్యాయులకు అనేక సదుపాయాలు సాధించటంలో ప్రధాన పాత్ర పోషించిందన్నారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా బీవీ రామారావు, అధ్యక్షుడిగా సీహెచ్ చంటిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎ. మురళి, ఉపాధ్యక్షుడిగా ఇ. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముసునూరు: రమణక్కపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రమణక్కపేటలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అక్కిరెడ్డిగూడెంలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.